# దారి ఎటు?

నాలుగేళ్లనుండీ ఇదీ వరస

నాల్నెల్లు బియ్యం కొట్లో గుమాస్తా

ఆర్నెల్లు ఖాళీ

మూణ్ణెల్లు బంగారం కొట్లో

నాల్నెల్లు ఖాళీ

రెండు నెలలు ఇనపసామాను కొట్లో

మళ్లీ ఐదు నెలలు ఖాళీ

కాలచక్రం సజావుగా తిర్గటం లేదు ఆనందరావుకి.

నాలుగేళ్ల క్రితం వరకూ మంచి ఉద్యోగమే చేశాడు ఆనందరావు. కొండమీది బండారాయి దొర్లి దొర్లి నెత్తిన పడ్డట్టు, ఏవో కారణాలు అందంగా అల్లి ఉద్యోగం ఊడబెరికేశారు. దరిమిలా వచ్చిన కొద్ది సొమ్మూ కర్పూరంలా కరిగిపోయింది. ఇక ఒకటే ఎదురీత... గంపెడు సంసారం లేదు కాని, ఉన్న ఒక్క కూతురూ పెళ్లికెదిగింది. కొడుకు పదోక్లాసు. ఇల్లాలుకి ఏ జబ్బూ లేదుకానీ, ఎదిగిన కూతురు గుండెల మీది కుంపటిలా కనిపిస్తున్నదామెకు. కొడుకునీ, కూతుర్నీ చూసి గజగజ వణికిపోతున్నాడు ఆనందరావు. పైగా ఇల్లు గడవాలి.

ఆనందరావుకి పూర్వాశ్రమంలో చాలా మంది మిత్రులుండేవారు. ఉన్న ఇబ్బందులు చెప్పుకుని ఈ పరిస్థితిల్లో అడిగినవాణ్ణే మళ్లీ అడగకుండా అప్పు సంపాదించ గలిగిన పరపతి ఉండేది. అది తీర్చే స్తోమత కనుచూపుమేరలో కనుపించకపోయినా... ఆర్నెల్లకు మళ్లీ మొదటివాడి వద్దకు వెళ్లి వంద అడిగితే పాతిక చేతులో పెట్టాడు. ... పీ ఆ పరిస్థితి కూడా దాటిపోయింది. ... డిగేవారికి మిత్రులుండరు. అందరూ శత్రువులయి పోయారు.

... ... ....

"ఏమండీ, ఇంట్లో బియ్యం నిండుకున్నై" పొద్దుట నిద్రలేవగానే శుభం పలికింది ఇల్లాలు సావిత్రి.

"నిండుకుంటే బెంగెందుకే... ఖాళీ అయితేకానీ..." అన్నాడు కాని నోట్లు నుంచి నవ్వురాలేదు ఆనందరావుకి. ముఖం పాలిపోయినట్లయింది. అవును, ఇప్పుడు లేవాలి... ఏటో వెళ్లాలి. మరో కొత్తమిత్రుడు దొరకాలి, చేయి చాచాలి. "ఎవరు, ఎవరి దగ్గరికెళ్లాలి" అని మనసులోనే అనుకుంటున్నా, మెదడులోని కొన్ని నరాలు కొన్ని బిగుసుకుపోతూన్నై, గుప్పెట్లు గట్టిగా బిగదీసుకున్నాడు.

రోజూ ఇదే వరసకాని... ఇవాళ ఎందుకో మరీ కంపరంగా ఉంది. హఠాత్తుగా కొడుకు బాబీ గుర్తుకొచ్చాడు.

"బాబీ లేడా... ఇంత పొద్దునే ఎక్కడకెళ్లాడే వెధవ.." అన్నాడు.

"ఇంట్లో ఉండి ఏం చేస్తాడు కనుక ఏ స్నేహితుడి దగ్గరకో వెళ్లుంటాడు" అంది సావిత్రి.

"నిద్ర లేవంగానే స్నేహితులేమిటి? చదువూ సంధ్యాలేదు... జులాయి వెధవల్తో తిరగడం... కాస్త మందిలించు" అన్నాడు విసుగ్గా.

"ఆ కాంట్రాక్టరుగారబ్బాయి పొద్దున్నే రమ్మన్నాడుట."

ఆ వెధవాయి, ఈ వెధవాయికి చదువు చెబుతాడా?"

"చదువుకి పుస్తకాలేవండీ... ఇంట్లో ఎలాగూ తిండిలేదు. స్నేహితుడన్నా ఇంత పెడతాడు."

కోపం తారాస్థాయికి చేరుకుంది ఆనందరావుకి. కాని పైకి ఏమీ అనలేదు... అశక్తత...

విసురుగా మంచంమీది నుంచి లేచి, షర్టూ, ప్యాంటు వేసుకుని, చెప్పులు తొడుక్కోబోతూ అప్రయత్నంగా ప్యాంటు జేబులో చేయి పెట్టాడు. అర్ధరూపాయితోబాటు, రెండు రోజుల క్రితం చంద్రం వద్ద నుంచి వచ్చిన ఉత్తరం కూడా బయటకు తీశాడు. కొండంత ఆశ అతణ్ణి ఆవహించింది.

ఉత్తరం మళ్లీ చదివాడు. ఇది ఏడోమాటు చదవటం...

"ఒరేయ్ ఆనందూ,

ఏడెవడా అని ఉలిక్కిపడకు. నేను నీ చిన్ననాటి ఏకైక మిత్రుణ్ణి చంద్రాన్ని. నేను పదిసార్లు హైదరాబాదు వచ్చినా నీ పత్తాలేదు. ఈ మధ్యనే మన జడ్డివెధవలేడూ... రామం... వాడు చెప్పాడు. నీవు హైదరాబాదులోన ఏడుస్తున్నావని ఇరవై ఏళ్లయింది నిన్ను చూసి ఈ ఢిల్లీలో నా జీవితం యాంత్రికం అయింది. ఈసారి నిన్ను తప్పక కల్సుకోవాలి. చిన్ననాటి కబుర్లు చాలా చెప్పుకోవాలి. 12వ తేదీ హైదరాబాద్ వస్తున్నాను. పదమూడు పొద్దునే కలవాలి. హిమాయత్‌నగర్ చౌరస్తా పక్కవీధిలో శ్మశానం ఉంది. దాని పక్క సందులో మా అక్క ఉంది. నా బస అక్కడే. అక్కడకు రా.

ఇట్లు

నీ చంద్రం"

అడ్రసు కూడా మరొక్కమారు మననం చేసుకున్నాడు. కళ్లలో నీళ్లు తిరిగినై ఆనందరావుకు. ఎంత ఆప్యాయత. చిన్ననాటి స్నేహం మరచి పోలేదు చంద్రం. ఆ రామం ఎవరో గుర్తుకు రావటం లేదు. ఏమైనా ఆ రామానికి మనసులోనే వేయిదండాలు పెట్టుకున్నాడు. చంద్రం ఢిల్లీలో పెద్ద ఆఫీసరు హోదాలో ఉన్నట్టు ఎప్పుడో, ఎక్కడో విన్నాడు తప్ప అతణ్ణి కలుసుకుని నిజంగానే ఇరవై యేళ్లయింది.

ఈ ఇరవై ఏళ్లలో చంద్రం ఎంత ఎత్తుకు ఎదిగాడు. తను ఎంత కిందకు దిగజారిపోయాడు. చంద్రాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో కలవటం... ఏదోగా అవుతున్నట్టు... భయం భయంగా ఉన్నట్టు ఫీలయ్యాడు ఆనందరావు. చిన్నతనంలో తాను హీరోగా తిరుగుతూంటే,

గోవిందరాజు శ్రీనివాసమూర్తి





తన వెనకాలే ఎప్పుడూ పడివుండే, తెల్లగా, బొద్దుగా ఉన్న చంద్రమే గుర్తుకొస్తున్నాడు.

ఇవాళే పదమూడో తేది.

మనసు విహంగంలా తేలుతోంది.

హిమాయత్‌నగర్ కేసి నడక సాగించాడు ఆనందరావు.

జేబులో అర్ధరూపాయి ఉన్నది. బస్సుకి చాలదు కనుక నడకే శరణ్యం. నడక అతడికి అలవాటే. అడిక్‌మేట్ నుండి సుమారు నలభై నిముషాలు పట్టవచ్చు. త్వరగా నడుస్తే అరగంటలో చేరుకోవచ్చు. వడిగానే నడవటం మొదలెట్టాడు ఆనందరావు.

నడుస్తూ కూడా మరోమారు ఉత్తరం చదువుకున్నాడు. "అమ్మ చంద్రం, ఎంత ఆ

ప్యాయతరా నీది'' అని మనసులోనే చంద్రానికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

చంద్రాన్ని కలుసుకోగానే ఏం మాట్లాడాలో తోచటం లేదు. ఏం చేస్తున్నావని చంద్రం అడిగితే ఏం చెప్పాలి... అసలు ఆ టాపిక్ రాకుండానే జాగ్రత్తపడాలి. చిన్నప్పుడు పక్కవీధిలోని పద్మను ఏడిపించి, ఆమెకు సింహస్వప్నంలా మారిన సంగతి సరదాగా చెప్పుకుంటే బాగుంటుంది. చంద్రాన్ని ఓ మాటు ఆ పక్కవీధిలోని లలిత చివాట్లు పెట్టడం, వాడు బిక్కముఖం పెట్టడం, తను వాణ్ణి ఓదార్చడం సరదా కబుర్లు చెప్పుకుంటే ఇప్పుడు తనేం చేస్తున్నాడో చెప్పుకునే అవసరంరాదు. పైగా షర్టూ, ప్యాంటూ కూడా కాస్త బాగానే ఉన్నాయి.

నడుస్తూనే ఉన్నాడు ఆనందరావు. ఎంతసేపటికీ హిమాయత్‌నగర్ చౌరస్తా వస్తున్నట్టు కనుపించడంలేదు.

''అయినా వీడికి ఇదే రోగం. ఇంటి అడ్రసు రాస్తే చాలదూ... వెధవది ఆ స్మశానం పక్క సందు అని రాస్తే కాని కనుక్కోలేమా! గుర్తుకి ఏదో ఆఫీసు, లేదా కిళ్లీకొట్టు లేదా లాండ్రీ లేదా... లేదా మరేదైనా రాయవచ్చు. స్మశానం అనే రాయాలా నాలుగు చివాట్లు పెట్టాలి'' అని సుతారంగా ఏం మాట్లాడాలో వల్లె వేసుకుంటున్నాడు. పదేళ్ల తర్వాత ప్రేయసి ప్రియుడు కలుసుకోబోతున్న పరధ్యానంలో ఎదుట ఉన్న దీపస్తంభం ముఖానికి గుద్దుకుంటే ఎలా వుంటుందో, అలానే, అంత అందమైన చిన్న ఉత్తరంలో స్మశానం అన్న మాట అతడిని ఏదో అనిర్వచనీయమైన బాధను కలుగచేసింది.

హిమాయత్‌నగర్ చౌరస్తా చేరేసరికి సుమారు ఎనిమిదిన్నర దాటుతున్నది. ఎండాకాలమేమో అప్పుడే గాడ్పు మొదలయింది. అయినా అడుగులు వేగంగా వేస్తున్నాడు ఆనందరావు.

మరో కొత్త సందేహం వచ్చింది. ఇంత ఆప్యాయంగా ఉత్తరం రాసిన చంద్రాన్ని తన ఇంటికి ఆహ్వానించడం ఎలా? తనది రెండు గదుల చిన్న పెంకుటిల్లు. వాడిది పెద్ద బంగళా అయిండొచ్చు. కనీసం హోటలుకన్నా కాఫీకి పిలిచే స్థోమత తనకు లేకపోయినందుకూ, తను అతణ్ణి కలవబోయేముందు మరో బలవత్తర కారణం ఉన్నందుకూ భగవంతుణ్ణి నిందించుకున్నాడు.

చంద్ర ఇల్లు దగ్గర పడుతున్నకొద్దీ గుండెల్లోంచి ఆయాసం వస్తున్నది. అయినా లెక్కచేయకుండా వడివడిగానే అడుగులు వేస్తున్నాడు. చంద్రాన్ని కలుసుకోబోతే ఆతృత ఎక్కువ అవుతున్నది.

... ... ...

సరీగ్గా

సరీగ్గా అదే సమయంలో

రోడ్డుకు ఎడమవైపుగా, చెత్తకుండీ పక్కనే, రోడ్డు మీదనే ఒక అందమైన దృశ్యం అతడికి కనబడింది.

అది ఇరవై రూపాయల కాగితం!

మడిచి పడి ఉందక్కడ.

ఒక చెంప ఆనందం, మరో చంప ముచ్చెమటలూ...

త్రోటుపాటు పడుతున్న అడుగులతో అక్కడే ఒక నిముషం తచ్చాడాడు ఆనందరావు.

ఎవరో పారేసుకున్నారు. ఆ ముందు నడుస్తున్న పదిమందిలో ఒకరిదా... అటు రివ్వున దూసుకుని వెళ్లిన స్కూటరిస్టుదా... పక్కనే కొత్త ఇంటికి ఇటుకలు ఎత్తుతున్న కూలీలదా...

ఎవరీ నోటు.

ఎవరిదైతే నేం...

తనున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నోటు తనకు భగవంతుడిచ్చిన ఆస్తిలా అనుకుంటూ వణుకుతున్న చేతుల్తో ఆ నోటుని తీసుకుని ఎవరూ చూడనట్టు నిర్ధారణ చేసుకుని జేబులో వేసుకోబోతూ చంద్రాన్ని కనీసం కాఫీకన్నా రమ్మని ధైర్యంగా పిలవచ్చు అన్న ఆవ్యక్తఆనందంతో తలపైకెత్తేడు.

ఘొల్లున నవ్వులు... ''ఒరేయ్'' అన్న కేక ''నోటు కింద పడేయరా, అది మాది'' అన్న ఆర్డరూ మళ్లీ నవ్వులూ.

ఆనందరావుకి ముచ్చెమటలు పోసినై. తను ఈ నోటు తీయడం ఎవరో చూశారన్నమాట వెనక్కు తిరిగి చూశాడు.

నలుగురు కుర్రవాళ్లు... పదిహేను, పదహారు సంవత్సరాల కుర్రవాళ్లు తనను చూసి నవ్వుతున్నారు.

''మేమే ఆ నోటు పడేసింది. ఎవడు ఎంత దొంగతనంగా లాగుతాడో చూద్దామనే వేశాం'' అని ఓ కుర్రవాడు గట్టిగా అరిచాడు.

''ఇది మీదా బాబు, తీసుకోండి'' అందామనుకున్నాడు కాని నోటంట మాటరావటం లేదు.


ఆ నలుగురు కుర్రవాళ్లనీ మరొక్కసారి చూశాడు ఆనందరావు.

అప్పుడే... ఆ క్షణంలో అతడిలోని కొన్ని నరాలు పటపట తెగిపోయినై.

ఆ నలుగురిలో ఒకడు తన కొడుకు బాబీ!

బాబీ కూడా తండ్రిని చూశాడు. అతడిలో నవ్వులేదు. నోటు తీసినవాడు తన తండ్రని తన స్నేహితులకి తెలుసా! ఏమో... తండ్రి రోడ్డుమీద పడ్డ నోటును ఏరుకోవడం అతడికి నచ్చలేదు. మమ్మల్ని ఇలానే పోషిస్తున్నాడా అన్న సందేహం వచ్చింది. తండ్రికేసి చూడలేక తలవెనక్కి తిప్పేసుకున్నాడు బాబీ.

''నోటు పారేసి పారిపోతున్నాడోయ్'' అన్న స్నేహితులమాట వినలేక తనూ అక్కడ



నుండి వేగంగా నడుచుకుంటూ వెడుతూ... కంట్రాక్టరు కొడుకు ఇరవై రూపాయల నోటు రోడ్డు మీద పడేద్దామనీ అది ఏరుకున్నవాళ్లని ఆటపట్టిద్దామన్న పిచ్చిపనికి తాను వంత పలుకుతాననీ అందుకు తన తండ్రి బలౌతాడని, తనూ ఈ దృశ్యం చూస్తాననీ, తన తండ్రీ తనను ఆ పరిస్థితిలో చూస్తాడనీ, అతడి ఊహకందని విషయం... • చాలా పొరపాటయింది అనుకున్నాడు బాబి.

నోటును రోడ్డుమీద పడేసి వేగంగా వెడుతున్నాడు ఆనందరావు. నడకకన్నా పరుగాగా ఉన్నది అతడి అడుగుల వేగం.

కోసం, అశక్తత, నీరసం ఇవన్నీ అతణ్ణి ఒక్కమారు ఆవహించి నిలువునా వణికిపోతున్నాడు. తను నోటు తీసుకోవడం కన్నా, ఆ దృశ్యం తన కొడుకు కంటపడటం అతణ్ణి కుంగదీస్తున్నది.


''ఓరి దేవుడా... ఎక్కడి పాపిష్టిరోజు తెచ్చి పెట్టావయ్యా... కుర్రవెధవలముందు... అందులోనూ నా కొడుకు ముందే నన్ను ముద్దాయిని చేసావు కదయ్యా. ఈ చేతుల్ని ఏంచేయను. ఈ తలను ఏ బండరాతి కేసి కొట్టుకోను...'' అనుకుంటూ స్మశానం వద్దకు చేరాడు. ఆపై సందే చంద్రానిది అయివుంటుంది.

చంద్రం స్మశానం గుర్తు ఎందుకో రాశాడో ఇప్పుడు అర్థం అవుతున్నది. ఇలాంటి పరిస్థితిలో పడ్డవాడు కాటి కాపరి వద్దకు వెళ్లి ''నాయినా, నేను జీవచ్ఛవాన్ని. నన్ను నిలువునా తగలెయ్. అని చెప్పుకునేందుకా...?''

అతడి బుర్రలోని వేడు సుడులు తిరుగుతూన్నది అక్కడే, ఆ క్షణంలోనే ఒక్కమారు గుండె ఆగిపోతే, ఏ ఖర్చూ లేకుండా ఎవరో ఆ స్మశానానికి తనను లాగేయకపోరు. భగవంతుడా నా గుండె ఆపేయ్'' అనుకున్నాడు కాని అతడి గుండె ఆగలేదు. వేగంగా కొట్టుకుంటూనే ఉన్నది.

చంద్రం ఇంటికి ఇక వెళ్లడానికి మనస్కరించడం లేదు. అయినా తప్పదు ఖాళీ చేతుల్తో ఇంటికి తిరిగి వెళ్లలేదు.

కొంచెం ముందుకు నడిచి, మలుపు తిరిగి నాలుగో యింటి వద్ద నెంబరు చూసి, ఇదే చంద్ర ఇల్లు అనుకుని గేటు తెరిచి లోపలకు




వెళ్లాడు ఆనందరావు. వరండాలో ఎవరూ లేరు. కాలింగ్ బెల్ నొక్కాడు. అతడి చేతులూ, పెదవులూ కంపించిపోతున్నై.

రెండు నిముషాల్లో ఓ యాభై యేళ్ల స్త్రీ తలుపు తీసింది.

''చంద్రంగారున్నారా?'' అన్నాడు గ్రుక్కతోటుపడుతూ.

''మీరు ఆనందుగారా... రండి... కూర్చోండి'' అన్నది ఆమె.

అయినా ఆనందరావు కూచోలేదు.

''చంద్రం మా తమ్ముడు. ఇవాళ మీరొస్తారని చెప్పాడు. కాని నిన్న సాయంత్రమే ఢిల్లీ నుండి ఫోనొచ్చింది. వెంటనే బయలుదేరి రమ్మని హడావుడిగా వెళ్లిపోయాడు. కూచోండి కాస్త కాఫీ తీసుకొస్తాను'' అని లోపలకు వెళ్లబోయింది ఆమె.

''వద్దు, వద్దు, ఇప్పుడే తాగాను. వస్తాను''

అంటూ గిర్రున తిరిగి ఒక్కొదుటన రోడ్డు మీద పడ్డాడు ఆనందరావు.

మళ్లీ రకరకాల ఆలోచనలు రాసాగినై.

''చంద్ర నిజంగానే ఢిల్లీ తిరిగి వెళ్లిపోయాడా. లేక ఇక్కడకు వచ్చింతర్వాత ఆ రామంలాంటి చిన్ననాటి మిత్రులెవన్నా తాను అనుభవిస్తున్న దుర్భర పరిస్థితిని చెబితే విని నన్ను కలిసేందుకు ఇష్టంలేక లేడని చెప్పించాడా. అతణ్ణి కూడా అప్పు అడుగుతానని భయపడ్డాడా! ఒకవేళ నిజంగానే చంద్రాన్ని కలవటం జరిగితే ఆ క్షణంలో అతణ్ణి అప్పు అడిగేంతటి నీచానికి ఒడిగడతానా... ఏమో... ఇంటి పరిస్థితిని బట్టి అడగవలసి వచ్చేదేమో'' అదీ తప్పినందుకు భగవంతుడికి కోటి దండాలు పెట్టుకున్నాడు ఆనందరావు.

స్మశానం దాటి ఇవతలకు రాగానే నలుగురు కుర్రవాళ్లు తనను చూసి నవ్విన నవ్వూ, అంతలోనే తనను చూసి వాడిపోయిన వాడి ముఖం... కడుపులో ఎవరో చేయి పెట్టి కెలుకుతున్నట్టు అనిపించింది.

భారంగా అడుగలు వేసుకుంటూ ఇంటికి తిరిగొచ్చాడు ఆనందరావు


సావిత్రి ఎదురొచ్చి ''ఏమండీ కుంపటి వెలిగించనా?'' అన్నది.

''ఆ వెలిగించు. ఈ ఉదయమే మన బాబీ కుంపటి వెలిగించాడు. కొండంత ఆశతో కలవబోయిన మిత్రుడు చేజారి పోయాడు. భగవంతుడే ఇచ్చాడనుకున్న మూల్యం ఏటిపాలయింది. నోటి వరకూ వచ్చి చేజారి పోవటం నాకలవాటే. ఒకరి ఆనందం మరొకరి గుండెల్లో గునపాలు దించుతుందని ఈవాళే నేను అనుభవం మీద తెలుసుకున్నాను.

సావిత్రి, ఇవాళ ఉదయమే నేను మరో జన్మ ఎత్తాను. ఆ పాత ఆనందరావు స్మశానంలో భూస్థాపితమైనాడు...''అని మంచంమీద కూలిపోయాడు ఆనందరావు.

అప్పటికే వంటగదిలోంచి ఈ మాటలు వింటున్న బాబీ ''నన్ను క్షమించు నాన్నా''. అన్నాడు కానీ, అది ఎవరికీ వినిపించలేదు.

రుచికరమైన 19
రకాలలో లభ్యం
కాగలవు.




ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.

ఉదయం వారపత్రిక